VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ శుక్రవారం 25 ఏప్రిల్ 2025

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 272

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



## స్కూటీలు..తులం బంగారం

# ఏమాయె

**ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ**

**వరంగల్ పర్యటనలో కవిత విమర్శలు**

తెలంగాణ తలపై కాళేశ్వరం నిర్మించి రైతన్నకు మరోసారి ఇచ్చిన కేసీఆర్ కు మద్దతుగా రైతన్నలు పెద్ద ఎత్తున సభలో పాల్గొనలన్నారు. అప్పుడు కాంగ్రెస్ పార్టీలో 12 మంది చనిపోతే ఒత్తిడి మేరకు మాత్రమే తెలంగాణ ఇచ్చిందని, ఇప్పుడు అదే కాంగ్రెస్ పార్టీ మళ్లీ మోసం చేస్తుంది కుట్రలు చేస్తుందని ఆమె పేర్కొన్నారు.

## నరమేథం సృష్టించిన వారిని

# వదలబోం



**వారికి అండదండగా ఉన్న వారినీ వదలం**

**ప్రపంచదేశాలకు అర్థమయ్యేలా మోడీ హెచ్చరిక**

**వెంటాడుతాం.. వెన్నువిరుస్తాం..**

**ఉగ్రవాదులకు కలలో కూడా ఊహించని శిక్ష విధిస్తాం**

**జమ్మూకశ్మీర్‌లో అమాయకుల ప్రాణాలను హరించిన ఉగ్రవాదులు ఎక్కడ నక్కినా వెతికి మరీ శిక్షిస్తామని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు.**

పాట్నా: కాశ్మీర్‌లో నరమేథం సృష్టించిన ముష్కరులను, వారికి అండగానిలిచిన వారిని వదిలి పెట్టబోమని ప్రధాని మోడీ స్పష్టం చేశారు. ప్రపంచ దేశాలకు భారత్ హెచ్చరిక అర్థం అయ్యేలా ఇంగ్లీష్‌లో కూడా మాట్లాడారు.ప్రధాని నరేంద్ర మోదీ సాధారణంగా హిందీలో ప్రసంగిస్తుంటారు. అంతర్జాతీయ వేదికలపైనా ఇదే భాషలో భారత వైఖరిని స్పష్టం చేస్తుంటారు. కానీ, నేడు బిహార్‌లో నిర్వహించిన ఓ సభలో మాత్రం అరుదైన రీతిలో ఒక్కసారిగా తన ప్రసంగాన్ని హిందీ నుంచి ఆంగ్లంలోకి మార్చారు. పహల్గాం ఉగ్రదాడిని ప్రస్తావిస్తూ.. ఇంగ్లీష్‌లోనూ హెచ్చరించడం గమనార్హం. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా తన బలమైన సందేశాన్ని ప్రపంచ దేశాలకు సూటిగా చేరవేసేందుకు ఆంగ్లంలో ప్రసంగించినట్లు- తెలుస్తోంది. ఇండియా విల్ ఐడెంటిఫై, ట్రాక్ అండ్ పనిష్ ఎవ్రీ టెర్రరిస్ట్ అండ్ దేర్ బ్యాకర్స్' అంటూ ప్రధాని మోదీ ఆంగ్లంలో స్పష్టం చేశారు. బిహార్ గడ్డ నుంచి యావత్ ప్రపంచానికి ఒక విషయం స్పష్టం చేస్తున్నా. ఉగ్రవాదులను, వారికి అండగా నిలిచేవారిని భూమిపై ఎక్కడున్నా సరే వెంటాడతాం. ఉగ్రవాదంతో దేశ స్ఫూర్తిని విచ్ఛిన్నం చేయలేరు. ఉగ్రవాదాన్ని శిక్షించకుండా వదిలిపెట్టబోం. బాధితులకు న్యాయం చేకూరేలా అన్ని విధాలా ప్రయత్నిస్తాం. ఈ విషయమై దేశం మొత్తం దృఢ సంకల్పంతో ఉందని అంటూ ప్రధాని మోదీ ఇంగ్లీష్‌లో పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రదాడి వేళ భారత్‌కు అండగా నిలిచిన దేశాలకు ప్రధాని మోదీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు చెప్పారు. మానవత్వాన్ని విశ్వసించే ప్రతి ఒక్కరూ మాకు అండగా నిలిచారు. వారందరికీ ధన్యవాదాలు అని పేర్కొన్నారు.



## తెలంగాణలో ముదురుతున్న ఎండలు

సాధారణం కంటే పెరగనున్న ఉష్ణోగ్రతలు

# ప్రపంచ దేశాలకు రోల్ మోడల్‌గా తెలంగాణ

'భారత్ సమ్మిట్'లో జరిగే చర్చాగోష్ఠుల్లో వివిధ దేశాల ప్రతినిధులతో పాటు కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీ, సల్మాన్‌ఖుర్షీద్, కేసీ వేణుగోపాల్ తదితరులు ప్రసంగించనున్నారు. సమ్మిట్ ఏర్పాట్లను కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, గుర్‌దీప్ సింగ్, శ్రీధర్‌బాబు, మహేశ్‌కుమార్‌గౌడ్, విశ్వనాథ్, రాజగోపాల్‌రెడ్డి, మధుయాస్కీగౌడ్ తదితరులు గురువారం సాయంత్రం పరిశీలించారు.

- శాంతి, అహింస, న్యాయం,
- పెట్టుబడులే లక్ష్యంగా 'భారత్ సమ్మిట్'
- భట్టి, ఉత్తమ్, గురుదీప్ సింగ్ వెల్లడి
- నేడు, రేపు హెచ్ఐసీసీ నోవాటెల్‌లో సమ్మేళనం
- హైదరాబాద్‌కు చేరుకున్న వివిధ దేశాల ప్రతినిధులు

ప్రపంచ శాంతి, అహింస, న్యాయం, పెట్టుబడులే లక్ష్యంగా 'భారత్ సమ్మిట్' నిర్వహిస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఏఐసీసీ నాయకుడు గుర్‌దీప్ సింగ్ సప్పల్ తెలిపారు.



## పదేళ్ల బిఆర్ఎస్ పాలన

# స్వర్ణయుగం

**గ్రామస్వరాజ్యం కోసం గాంధీ కలలను నిజం చేశాం**

**ఉద్యమ కలను సాకారం చేసిన కెసిఆర్**

**ఎక్స్‌లో పోస్ట్ చేసిన బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్**



## పర్యాటకులపై ఉగ్రదాడి

# గర్హనీయం

ఉగ్రవాదుల కాల్పుల్లో మరణించిన పర్యాటకులకు ఆత్మశాంతి కలగాలని ప్రార్థిస్తూ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో గురువారం ముఖ్యమంత్రి రెండు నిమిషాలు మౌనం పాటించారు.

**జమ్మూకశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి గర్హనీయమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ చర్యను తీవ్రంగా ఖండించారు.**





## పోలీసులకు సీఎం అభినందన

తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందించారు. ఇటీవల విడుదలైన 'ఇండియన్ జస్టిస్ రిపోర్ట్-2025' నివేదిక ప్రకారం పోలీసింగ్‌లో తెలంగాణ.. దేశంలోనే మొదటిస్థానంలో నిలిచిన నేపథ్యంలో డీజీపీ డా.జితేందర్, ఇంటెలిజెన్స్ డీజీ బి.శివధర్‌రెడ్డి గురువారం సచివాలయంలో సీఎం రేవంత్‌ను కలిశారు.

## కాశ్మీర్ ఘటనపై కాంగ్రెస్ తీరు బాధాకరం




**భద్రతా వైఫల్యం పేరుతో రాజకీయ పాకులాట**

**కాంగ్రెస్ తీరుపై మండిపడ్డ బిజెపి లక్ష్మణ్**

# ఏడో బ్లాకు తొలగించాల్సిందే!

హైదరాబాద్: కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో అనేక లోపాలు చోటు చేసుకున్నాయని, డిజైన్, నిర్మాణం, నాణ్యత, నిర్వహణ ఇలా ప్రతి అంశంలో వైఫల్యాల కారణంగా తీవ్ర నష్టం వాటిల్లిందని, మూడు బ్యారేజీల పునరుద్ధరణకు సంబంధించి డిజైన్ల ప్రామాణికాల విషయంలో సమగ్ర పునఃపరిశీలన చేయాలని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) తుది నివేదిక స్పష్టం చేసింది. మూడు బ్యారేజీల దీర్ఘకాలిక మన్నిక, భద్రత దృష్ట్యా డిజైన్ల పునఃపరిశీలన తప్పనిసరని పేర్కొంది. మేడిగడ్డ ఏడో బ్లాక్‌కు జరిగిన నష్టాన్ని పరిశీలిస్తే తిరిగి బాగు చేయడం సాధ్యం కాదని, ఇక్కడ గేట్లు నిర్వహించడానికి వీలులేదని, ఈ బ్లాకును పూర్తిగా తొలగించి మిగిలిన బ్లాకులకు నష్టం జరగకుండా చూడాలని స్పష్టం చేసింది. ఆయా బ్లాకుల పటిష్ఠతపైనా



సమగ్ర పరిశీలన చేయాలంది. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో నాణ్యత, డిజైన్ లోపాల వల్ల కొన్ని చోట్ల స్ట్రక్చరల్ సమస్యలు వచ్చాయని వెల్లడించింది. బ్యారేజీల నిర్మాణ సమయంలో ప్రాజెక్టు మౌలికాంశాలకు సంబంధించి అనేక మార్పులు జరిగాయని, జియో టెక్నికల్ ఇన్వెస్టిగేషన్స్ జరగకుండానే బ్యారేజీల నిర్మాణ స్థలాలను మార్చారని తెలిపింది. మేడిగడ్డ ఏడో బ్లాక్ కుంగడానికి ప్రధాన కారణం సీకెంట్ పైల్స్ నిర్మాణంలో మార్గదర్శకాలు పాటించకపోవడమేనని, సరైన నాణ్యత ప్రమాణాలు పాటించకుండా బ్యారేజీ ఎగువ, దిగువ కట్ ఆఫ్ వాల్స్ స్ట్రక్చరల్ ఇంటెగ్రిటీ విషయంలో రాజీ పడినట్లయ్యిందని వెల్లడించింది. బ్యారేజీలకు మరింత నష్టం వాటిల్లకుండా నివారించేందుకు వాటి పటిష్ఠత, భద్రతపై సమగ్ర పరిశోధన జరగాలని ఎన్డీఎస్ఏ తుది నివేదికలో స్పష్టం చేసింది.

# హైదరాబాద్‌లో వరుస ఈవెంట్స్


## నిఘా హెచ్చరికలతో భద్రత కట్టుదిట్టం



హైదరాబాద్: కశ్మీర్ పహల్గాం ఉగ్రదాడి జరిగిన తరుణంలో మరిన్ని దాడులు జరిగే అవకాశం ఉందని కేంద్ర నిఘావర్గాల హెచ్చరికతో తెలంగాణ ప్రభుత్వం అలర్ట్ అయ్యింది. నిఘా హెచ్చరికలతో పోలీసు శాఖ అప్రమత్తం అయ్యింది. హైదరాబాద్ లో ప్రతిష్టాత్మకమైన ఈవెంట్లు ఉన్న తరుణంలా సెక్యూరిటీని అలర్ చేసింది. ఏప్రిల్ 25, 26 తేదీల్లో భారత్ సమ్మిట్, మే 7 నుంచి మిస్ వరల్డ్-2025 ఈవెంట్లు ఉండటంతో పోలీసు వర్గాలు పటిష్టమైన నిఘా ఏర్పాటు- చేస్తున్నారు. భారత్ సమ్మిట్ లో జాతీయ, అంతర్జాతీయ రాజకీయ, ఆర్థిక పరమైన అంశాలపై చర్చ జరగనుంది. ఈ సమ్మిట్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ సహా వంద దేశాల నుంచి దాదాపు 400 మంది హాజరయ్యే అవకాశాలు ఉన్నాయి. అదేవిధంగా మిస్ వరల్డ్ పోటీ-లకు 140 దేశాల నుంచి కం-టె-స్టెంట్స్ హాజరవుతారు. ఇవన్నీ అత్యంత ప్రతిష్టాత్మక కార్యక్రమాలు కావడంతో పోలీస్ యంత్రాంగానికి సవాల్ గా మారింది.

వేగుచుక్క

# ఎరుపెక్కుతున్న కర్రెగుట్టలు



చర్ల: తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు కర్రెగుట్టలు ఎరుపెక్కుతున్నాయి. నక్సల్స్ వ్యతిరేక ఆపరేషన్‌కు శ్రీకారం చుట్టిన భద్రతా బలగాలు ఛత్తీస్‌గడ్ రాష్ట్రం బీజాపుర్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం ములుగు జిల్లాల్లో విస్తరించి ఉన్న అడవుల్లోకి మూడు రోజులుగా దూసుకెళ్తున్నాయి. తారసపడుతున్న మావోయిస్టులపై విరుచుకుపడుతున్నాయి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ఊసూరు ఠాణా పరిధి నంబి సమీప నడిపల్లి, గలగం అటవీ ప్రాంతాల్లో ఎదురుకాల్పులు చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాంతంలో ముగ్గురు మావోయిస్టుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నట్లు బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ గురువారం వెల్లడించారు. ఇద్దరు జవాన్లకు కూడా గాయాలు కావడంతో హెలికాప్టర్‌లో బీజాపుర్ తరలించారు. కర్రెగుట్టల్లో భద్రతా బలగాలు దాదాపు 100పైగా ఐఈడీలను నిర్వీర్యం చేసినట్లు తెలుస్తోంది. కర్రెగుట్టలను జల్లెడ పడుతున్న బలగాలకు అత్యవసర సామగ్రి, ఆహార పదార్థాలను వెంకటాపురం నుంచి హెలికాప్టర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం నడిపల్లి, పూజారికాంకేర్, నంబిలో ప్రధానంగా కాల్పులు జరుగుతున్నాయి. ఊసూరు, రాంపురం, భీమంరంపాడు, కస్తూరిపాడు, చినవుట్లపల్లి, పెదవుట్లపల్లి, గుంజపర్తి, గల్గం, ఎలిమిడి, చెలిమెల, డోలీ, పామునూరు తదితర గ్రామాల్లో ఐఈడీ శబ్దాలు, కాల్పుల మోతతో అక్కడి జనం వణికిపోతున్నారు. ఎండ తీవ్రతకు భద్రతా బలగాలు వడదెబ్బ బారినపడుతున్నాయి. కూంబింగ్‌లో అస్వస్థతకు గురైన సుమారు 15 మందిని వెంకటాపురం చేర్చారు. వెంకటాపురం నుంచి హెలికాప్టర్‌లో సామగ్రి తరలిస్తున్న జవాన్లుహిడ్మా ప్లటూన్ నిర్మూలనపైనే గురి

హైదరాబాద్: మావోయిస్టు పార్టీ మిలిటరీ విభాగం 'పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ'(పీఎల్‌జీఏ) లక్ష్యంగానే పోలీసు బలగాలు 'బచావో కర్రెగుట్టలు ఆపరేషన్' నిర్వహిస్తున్నాయి. తెలంగాణ వైపు ములుగు జిల్లా వాజేడు, వెంకటాపురం మండలాలతోపాటు ఛత్తీస్‌గఢ్ వైపు బీజాపూర్ జిల్లా ఊసూరు బ్లాక్ సరిహద్దులుగా సుమారు 90 కి.మీ. పొడవున గొలుసుకట్టుగా ఈ కొండలు విస్తరించి ఉన్నాయి. సముద్ర మట్టానికి సుమారు 9 వేల అడుగుల ఎత్తులో ఉండటంతోపాటు వీటిపైన దాదాపు 10-15 కి.మీ. మేర విస్తీర్ణం ఉండటంతో కొన్నేళ్లుగా మావోయిస్టులు స్థావరంగా మార్చుకున్నారు. సుమారు వెయ్యి మంది పీఎల్‌జీఏ సభ్యులు ఇక్కడే ఉన్నట్లు నిఘావర్గాల సమాచారం. కేంద్ర కమిటీ అగ్రనాయకులు హిడ్మా, దేవ, వికాస్, దామోదర్ వంటి వారూ ఉన్నట్లు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే సుమారు 3 వేల మంది బలగాలు ఈ ఆపరేషన్‌లో నిమగ్నమైనట్లు తెలుస్తోంది. గురువారం ఉదయం మరో 2 వేల మందిని రప్పించినట్లు తెలుస్తోంది. కొందరు గుట్టల్లో కూంబింగ్‌లో నిమగ్నం కాగా.. మరికొందరు ఊసూరు బ్లాక్‌తోపాటు ఇటు వాజేడు, వెంకటాపురం వైపు మకాం వేసినట్లు తెలుస్తోంది. అటువైపు ఛత్తీస్‌గఢ్ ప్రాంతంలో వేల సంఖ్యలో బలగాలు తిష్ఠ వేసి ఉన్న నేపథ్యంలో మావోయిస్టులు తెలంగాణ వైపు గుట్టలు దిగక తప్పదన్న అంచనాతో అంబుష్(మాటు) వేసినట్లు సమాచారం. మావోయిస్టు పార్టీలో పీఎల్‌జీఏనే మిలిటరీ ఆపరేషన్లు నిర్వహిస్తోంది. 1999 డిసెంబరు 2న ఉమ్మడి కరీంనగర్ జిల్లా మల్హార్ మండలం కొయ్యూరు ఎన్‌కౌంటర్‌లో పీపుల్స్‌వార్ కేంద్ర కమిటీ సభ్యులు నల్లా ఆదిరెడ్డి, ఎర్రంరెడ్డి సంతోష్‌రెడ్డి, శీలం నరేశ్ మృతిచెందిన తరువాత పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ(పీజీఏ) ఏర్పాటైంది. సీపీఐ-పీపుల్స్‌వార్‌తో మావోయిస్టు కమ్యూనిస్ట్ సెంటర్ ఆఫ్ ఇండియా(ఎంసీసీఐ) 2004 సెప్టెంబరు 21న విలీనమై సీపీఐ-మావోయిస్టుగా అవతరించిన క్రమంలో మిలిటరీ విభాగం పీఎల్‌జీఏగా అవతరించింది. పార్టీలోని సెంట్రల్ మిలిటరీ కమిషన్(సీఎంసీ)కి అగ్రనేత, కోరుట్లకు చెందిన తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ నేతృత్వం వహిస్తున్నప్పటికీ మోస్ట్ వాంటెడ్ హిడ్మా ఆధ్వర్యంలోని మొదటి ప్లటూన్ కీలకంగా ఉంది. దీన్ని నిర్మూలించగలిగితే మావోయిస్టు సీఎంసీ వెన్ను విరిగినట్లవుతుందని నిఘావర్గాలు నమ్ముతున్నాయి. దీంతో కర్రెగుట్టల్లో హిడ్మా బృందం కోసం వేట ముమ్మరం చేశాయి. ఈ నెల 22 నుంచి ప్రారంభమైన ఈ ఆపరేషన్ మరో వారంపాటు కొనసాగనున్నట్లు తెలుస్తోంది.

## కాశ్మీర్ ఘటనపై కాంగ్రెస్ తీరు బాధాకరం

హైదరాబాద్:ఉగ్రదాడిపై కాంగ్రెస్ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు బాధాకరమని బీజేపీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ భద్రతా వ్యవస్థ వైఫల్యాన్ని చూపించేందుకు ప్రయత్నిస్తూ రాజకీయ లబ్ధి కోసం మాట్లాడుతుందన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో

మాట్లాడిన లక్ష్మణ్, కాంగ్రెస్ పార్టీ తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తాజాగా జరిగిన కాంగ్రెస్ నేతలు సమావేశంలో దాడి ఘటనను పొలిటికల్ ఈవెంట్‌లా మార్చే ప్రయత్నం చేశారని ఆయన ఆరోపించారు. భద్రతా సమస్యపై అసత్య ప్రచారాలు చేసి ప్రజల్లో అపోహలు సృష్టించేందుకు కాంగ్రెస్ పూనుకుంటోందని విమర్శించారు. కాగా, కాంగ్రెస్ పార్టీకి పాకిస్తాన్ పట్ల ఉన్న ప్రేమ కొత్తది కాదని, ఇప్పటికే మన రాష్ట్రానికి చెందిన కొందరు కాంగ్రెస్ నేతలు పాకిస్తాన్‌ను ప్రేమిస్తున్నారని అన్నారు. అలాంటి నేతలకు భారత భద్రతపై మాట్లాడే అర్హత లేదని ఆయన అన్నారు. అలాగే కాంగ్రెస్ నేతలు హిందువులపై దాడులను నెపంగా చూపించి 'సాఫ్రాన్ టెర్రరిజం' అంటూ మాట్లాడినవాళ్లే.. ఇప్పుడేమిటో 'ఇస్లామిక్ టెర్రరిజం', 'జిహాదీ టెర్రరిజం' అనే పదాలను ఉపయోగించేందుకు కూడా భయపడుతున్నారని విమర్శించారు. రాబర్ట్ వాద్రా చేసిన వ్యాఖ్యలు ఉగ్రవాదాన్ని సమర్థించేలా ఉన్నాయని పేర్కొంటూ, కాంగ్రెస్ పార్టీ అతని వ్యాఖ్యలపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. కావాల్సినప్పుడు మాట్లాడే బీఆర్ఎస్ పార్టీ ఈ విషయంలో మాత్రం నోరు మెదపకపోవడమేమిటని ఆయన అన్నారు. మజ్లిస్ పార్టీకి మద్దతు ఇవ్వాలన్న ఉద్దేశంతోనే ఇలా చేస్తుందా అని ఆయన సందేహం వ్యక్తం చేశారు. ట్విట్టర్ లో చురుగ్గా ఉండే కేటీఆర్, ఎమ్మెల్సీ ఎన్నికల్లో మజ్లిస్‌కు సహకరించారని అన్నారు. చివరగా కాంగ్రెస్ చౌకబారు రాజకీయాలు మానుకోవాలని, దేశ భద్రత వంటి సున్నిత అంశాలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించకూడదని ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ అన్నారు.

## ఉగ్రవాదులను నిర్దాక్షిణ్యంగా ఏరిపారేయాలి

నెల్లూరు: ఉగ్రవాదుల ఏరివేతలో కనికరం ఉండరాదని, వారిని క్షమించరాదని డిప్యూటి సిం పవన్ కళ్యాణ్ అన్నారు. వారికి మతం,మానవ్తంవ లేదన్నారు. జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన మధుసూదనరావుకు డిప్యూటీ-సీఎం పవన్ కళ్యాణ్ నివాళులర్పించారు. గురువారం కావలి చేరుకున్న పవన్.. నేరుగా మధుసూదనరావు ఇంటికి వెళ్లి.. ఆయన పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆపై కుటుంబసభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. కాశ్మీర్‌లో కిరాతకంగా తూటాలు పేలిస్తే, దేశ వ్యాప్తంగా మధుసూదనరావుకు నివాళులర్పించారన్నారు. ఈ సంఘటనను కుటుంబ సభ్యులు ఇంకా నమ్మలేకపోతున్నారని తెలిపారు. వారితో మాట్లాడినప్పుడు... ఆయన భార్య, పిల్లలు ఏం జరిగింది.. ఎలా జరిగిందో చెప్పారన్నారు. వాళ్లు చెబుతుంటే తనకే పేగులు మెలబెట్టినట్టు ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ ధర్మాన్ని ఆచరిస్తారని తెలుసుకుని హతమార్చారంటే ఎంతటి దారుణమని మండిపడ్డారు. ఉగ్రవాదులు ఎక్కడున్నా సరే నిర్దాక్షిణ్యంగా ఏరేయాలి, మనకి కనికరం ఎక్కువైపోయింది అని అన్నారు. తాను మాట్లాడలేక పోతున్నానని.. రేపో, ఎల్లుండో మంగళగిరిలో ప్రెస్‌మీట్ పెట్టి అన్ని వివరిస్తానని తెలిపారు. శుక్రవారం వైజాగ్ కూడా వెళుతున్నానని చెప్పారు. ఎంత శాడిస్టికల్‌గా, మెతడాలికల్‌గా, కోల్డ్ బ్లెడెడ్‌గా చంపేశారన్నారు. కాశ్మీర్ రెండేళ్లుగా ప్రశాంతంగా ఉందనే ఇంతటి దారుణానికి, కిరాతకానికి పాల్పడ్డారని మండిపడ్డారు. సమ్మర్‌లో షూటింగ్ కోసం కాశ్మీర్‌కు చాలా సార్లు వెళ్లానని.. అక్కడ పరిస్థితులు తనకు తెలుసన్నారు. ఉగ్రవాదులు ఎక్కడున్నా నిర్దాక్షిణ్యంగా ఏరేయాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. పవన్ వెంట మంత్రులు ఆనం, నాదెండ్ల, సత్యకుమార్, ఎమ్మెల్యేలు కావ్యా కృష్ణారెడ్డి, సోమిరెడ్డి, ఆర్ఎస్ఎస్ జాతీయనేత మధుకర్ ఉన్నారు.కాగా.. జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రమూకల దాడిలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మధుసూదన్‌రావు ప్రాణాలు కోల్పోయాడు. బెంగళూరులో సాఫ్ట్‌వేర్‌గా స్థిరపడ్డ మధుసూదన్ ఫ్యామిలీతో కలిసి పహల్గామ్ విహారయాత్రకు వెళ్లారు.

అయితే ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో అతడు మృతిచెందాడు. బుధవారం రాత్రి మధుసూదన్ మృతదేహాన్ని చెన్నై ఎయిర్‌పోర్టుకు.. అక్కడి నుంచి రోడ్డు మార్గాన నెల్లూరు జిల్లా కావలికి తీసుకొచ్చారు. కుమారుడి మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు కన్నీమున్నీరుగా విలపించారు. ఇక పెహల్గామ్ ఉగ్రదాడిలో మరో ఏపీ వాసి కూడా ప్రాణాలు కోల్పోయాడు. విశాఖకు చెందిన రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగి చంద్రమౌళి ఉగ్రమూకల దాడిలో మృతిచెందాడు.

## స్కూటీలు..తులం బంగారం ఏమాయె

వరంగల్: వరంగల్ గడ్డ అంటే ఉద్యమాల గడ్డని, తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిందని.. వరంగల్ లో సభ పడితే విదేశాల్లో ఉన్న వాళ్ళు కూడా వచ్చి మద్దతు తెలిపారని

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత గుర్తు చేసారు. వరంగల్ జిల్లాలో ఆమె పర్యటించారు. ఈ నేపథ్యంలో ఆమె ఓరుగల్లులోని భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. అక్కడ ఆమె ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఎల్కతుర్తి లో బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆపై మీడియాతో ముచ్చటించారు. తెలంగాణ ఉనికిని కోల్పోతున్న సమయంలో కేసీఆర్ పిడికిలి బిగించి తెలంగాణ ఉద్యమంతో అందరినీ ఒక్క తాటికి పైకి తెచ్చి తెలంగాణ ను ఉనికి కాపాడాడన్నారు. 2001లో కేసీఆర్ పెట్టిన తెలంగాణ పార్టీ టిఆర్ఎస్ పార్టీ 25 సంవత్సరాలు పూర్తిచేసుకుందని తెలిపారు. ఇక ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆడపిల్లల్ని మోసం చేసిందని.. స్కూటీలు ఇస్తామని విద్యార్థులు మోసం చేసారని అన్నారు. అలాగే బంగారం ఇస్తామని చెప్పి మహిళలను మోసం చేసారని తెలిపారు. ఇలా మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలంటే మహిళలు సభకు పెద్ద ఎత్తున హాజరు కావాలన్నారు.

తెలంగాణ తలపై కాళేశ్వరం నిర్మించి రైతన్నకు మరోసారి ఇచ్చిన కేసీఆర్ కు మద్దతుగా రైతన్నలు పెద్ద ఎత్తున సభలో పాల్గొనలన్నారు. అప్పుడు కాంగ్రెస్ పార్టీలో 12 మంది చనిపోతే ఒత్తిడి మేరకు మాత్రమే తెలంగాణ ఇచ్చిందని, ఇప్పుడు అదే కాంగ్రెస్ పార్టీ మళ్లీ మోసం చేస్తుంది కుట్రలు చేస్తుందని ఆమె పేర్కొన్నారు. ఆ కుట్రలన్నిటిని పటాపంచలు చేయాలంటే ఈ సభను విజయవంతం చేయాలని ఆమె కోరారు. కేసిఆర్ మహిళలకు రాజకీయాల్లో అవకాశాలు కల్పించే లాగా రిజర్వేషన్ తీసుకువచ్చిన ఘనత ఉందని, ఎల్కతుర్తి సభలో ప్రత్యేక మహిళా గ్యాలరీలను ఏర్పాటు- చేస్తున్నమని, సభకు వచ్చే మహిళలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకుంటామని అవ్విడా తెలిపారు. కాంగ్రెస్ నాయకుల్లారా ఖబర్దార్.. ప్రజలకు నీ మోసం ఏంటో తెలిసిపోయిందని, 16 నెలల్లోనే మీరు ఏమి చేయలేరని తెలంగాణ ప్రజలకు తేలిపోయిందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నాయకుల్లారా అవాకలు చెవాకులు పేలుస్తున్నారు. మా సభలో పల్లీలు, బఠానీలు అమ్ముకునే అంత మంది కూడా మీరు ఉండరు. అవాకులు, చివాకులు పేలిస్తే చూస్తూ ఊరుకోమని అన్నారు. రూపాంతరం చెందడం అనేది సర్వసాధారణం.. టీ-ఆర్ఎస్ బీఆర్ఎస్ గా రూపాంతరం మాత్రమే చెందింది.. పార్టీ మారలేదని ఆవిడ మాట్లాడారు.

## తెలంగాణలో ముదురుతున్న ఎండలు

### సాధారణం కంటే పెరగనున్న ఉష్ణోగ్రతలు



హైదరాబాద్ తెలంగాణలో రానున్న రెండు రోజుల్లో ఎండల తీవ్రత మరింత అధికంగా ఉండే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2-3 డిగ్రీలు ఎక్కువగా ఉండే వీలుందని వెల్లడించింది. ఇవాళ, రేపు ఉత్తర తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో అక్కడక్కడా వడగాల్పులు వీచే అవకాశముందని పేర్కొంది. చాలా జిల్లాల్లో రాత్రిపూట వేడి వాతావరణం మరింత ఎక్కువగా ఉండనుందని తెలిపింది. ఉత్తర, దక్షిణ ఉపరితల ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది. శుక్ర, శనివారాల్లో కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు అక్కడక్కడ కురిసే వీలుందని పేర్కొంది. గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశముందని వెల్లడించింది.

## పదేళ్ల బిఆర్ఎస్ పాలన స్వర్ణయుగం



హైదరాబాద్: తన పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు కేసీఆర్ ఉద్యమ నినాదాలను నిజం చేశారని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గ్రామస్వరాజ్యం కోసం జాతిపిత మహాత్మాగాంధీ కన్న కలలను కూడా సాకారం చేశారని చెప్పారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా కేటీఆర్.. బీఆర్ఎస్ హయాంలో జరిగిన పల్లె ప్రగతిని గుర్తుచేస్తూ తన ఎక్స్ ఖాతాలో ఒక పోస్టు పెట్టారు. ఆ పోస్టులో కేటీఆర్.. 'పదేళ్ల పాలనలో ఉద్యమ నినాదాలను నిజం చేయడమేగాక గ్రామస్వరాజ్యం కోసం జాతిపిత మహాత్ముడు కన్న కలలను కూడా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సాకారం చేశారు. ఇవాళ జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం జరుపుకుంటు-న్న వేళ.. పల్లెసీమలే దేశానికి పట్టు-గొమ్మలన్న మహాత్మా గాంధీ ఆశయాలే స్ఫూర్తిగా బీఆర్ఎస్ పాలనలో ప్రాణం పోసిన 'పల్లెప్రగతి'ని గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఉంది. సమైక్య పాలనలో దశాబ్దాలపాటు- దగాపడ్డ పల్లెలను దర్జాగా కాలర్ ఎగరేసుకునే స్థాయికి తీర్చిదిద్దిన సందర్భాలు అపూర్వం. అనితర సాధ్యం.' అని పేర్కొన్నారు. సమస్యల సుడిగుండంలో విలవిలలాడిన ప్రతి పల్లె నాడు సకల సౌకర్యాల హరివి÷-లలైంది. కేసీఆర్ సంకల్పంతో ప్రతి పల్లెసీమ ప్రగతిసీమగా మారింది. ప్రతి పల్లెలో డంప్ యార్డు తప్ప.. చెత్త కంపు లేని స్థితి వచ్చింది. కూలిపోయే స్థితి ఉన్న ఖాళీ ఇండ్ల కిరికిరి నుంచి పొంగిపొర్లే మురికి కాలువల శుభ్రత వరకూ ప్రతి సమస్యకు పదేళ్ల పాలనలో శాశ్వత పరిష్కారం దొరికింది. కలుషిత నీటి కలకలం లేకుండా, సీజనల్ రోగాల చింతలేకుండా సాగిన పంచాయతీల ప్రస్థానం గ్రామ స్వరాజ్యంలో ఓ స్వర్ణయుగం.' అని కేటీఆర్ రాసుకొచ్చారు. పచ్చదనానికి కొదవ లేకుండా, నిధులకు కొరత లేకుండా, విధులకు ఆటంకం లేకుండా, ప్రతి ఊరును మెరుగైన జీవనానికి మారుపేరుగా మార్చింది కేసీఆర్ విజనే. దేశంలో 3 శాతం జనాభా ఉన్న తెలంగాణ, పల్లెప్రగతిలో 30 శాతం అవార్డులను గెలుచుకోవడం పల్లె ప్రగతిలో భాగస్వాములైన ప్రతి ఒక్కరి విజయం. నాడు పదేళ్లపాటు- మురిసిన పల్లె, కాంగ్రెస్ పాలనలో నేడు మళ్లీ కన్నీరు పెడుతోంది. కాంగ్రెస్ పాలనలో గ్రామస్వరాజ్యం పూర్తిగా గాడితప్పింది. ఏడాదిన్నర గడిచినా స్థానిక సంస్థలకు ఎన్నికలు లేవు. 15వ ఆర్థిక సంఘం నిధులు లేవు. గ్రామాల్లో కనీస వసతులు లేవు. పల్లె ప్రజలకు గుక్కెడు మంచినీళ్ల దిక్కు లేవు.' అని కేటీ-ఆర్ నేటి దుస్థితిని వివరించారు.

చివరికి రాష్ట్రంలో పంచాయతీ సిబ్బందికి వేతనాలు లేవు. ఉపాధి హామీ కూలీలకు పనిదినాలు లేవు. మాజీ సర్పంచ్‌ల బిల్లులకే మోక్షం లేదు. దేశంలోనే ఆదర్శ గ్రామాలకు చిరునామాగా నిలిచిన తెలంగాణ పల్లెలు అధ్వాన పరిస్థితులకు అడ్రస్‌గా మారడం అత్యంత బాధాకరం. ఢిల్లీ పార్టీలను నమ్మిన పాపానికి

పంచాయతీరాజ్ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసిన తీరును తెలంగాణ పల్లె ప్రజలు గమనిస్తున్నారు. కేంద్రంలో అధికారంలో ఉండి తీవ్ర అన్యాయం చేస్తున్న బీజేపీకి, పచ్చని పల్లెలను సంక్షోభంలోకి నెట్టిన కాంగ్రెస్ పార్టీకి జనం కర్రుకాల్చి వాతపెడుతరని హెచ్చరించారు.

## ప్రపంచ దేశాలకు రోల్ మోడల్‌గా తెలంగాణ




హైదరాబాద్:ప్రపంచ శాంతి, అహింస, న్యాయం, పెట్టుబడులే లక్ష్యంగా 'భారత్ సమ్మిట్' నిర్వహిస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఏఐసీసీ నాయకుడు గుర్‌దీప్ సింగ్ సప్పల్ తెలిపారు. ఈ నెల 25, 26 తేదీల్లో హైదరాబాద్ హెచ్ఐసీసీలోని నోవాటెల్ హోటల్‌లో జరగనున్న భారత్ సమ్మిట్ ఏర్పాట్లను వారు గురువారం పర్యవేక్షించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. 'జవహర్‌లాల్ నెహ్రూ ప్రవేశపెట్టిన అలీన విధానంతో భారతదేశంలో అతిపెద్ద ప్రజాస్వామ్య రాజకీయ పార్టీగా కాంగ్రెస్ నిలబడింది. ప్రపంచంలోని ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో నెహ్రూ ఆలోచనలు, అలీన విధాన స్ఫూర్తితో, రాహుల్‌గాంధీ ఆలోచన మేరకు ఇప్పుడు కాంగ్రెస్ ఈ సమ్మేళనాన్ని నిర్వహిస్తోంది. వందకు పైగా దేశాల నుంచి 450 మందికి పైగా ప్రతినిధులు హాజరవుతున్నారు. వీరిలో ప్రభుత్వాధినేతలు, పార్లమెంటు సభ్యులు, తత్వవేత్తలు, కార్పొరేట్ ప్రతినిధులు, మేధావులు, పెట్టుబడిదారులు ఉన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు, ఆలోచనలు, పెట్టుబడులకు అనువైన వనరులను తెలియచేసే ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేశాం. ఆయా దేశాలకు ఇవి రోల్‌మోడల్ అవుతాయని భావిస్తున్నాం. ప్రతినిధులను శనివారం ఉదయం ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్‌జీఎస్) అమలును చూపించేందుకు క్షేత్రస్థాయి పర్యటనకు తీసుకువెళ్తాం. శనివారం సాయంత్రం వారు శిల్పకళా వేదికలో ఇందిరా మహిళాశక్తి బజార్‌ను సందర్శిస్తారు. కశ్మీరులో ఉగ్రదాడి జరిగిన పహల్గాంను సందర్శించనున్న రాహుల్ గాంధీ.. అక్కడి నుంచి హైదరాబాద్ చేరుకుంటారు" అని భట్టి వివరించారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచ దేశాల నుంచి వచ్చే ప్రతినిధులకు తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి ఉన్న సానుకూలతలను వివరిస్తాం. కశ్మీర్‌ను ఆర్థికంగా దెబ్బతీయాలని చేసిన ఉగ్రదాడిని ఖండిస్తున్నాం. భారతదేశంలో విభేదాలను పక్కనపెట్టి అందరూ ఏకం కావాల్సిన సమయమిది. ఈ విషయంలో భారత ప్రభుత్వం తీసుకున్న ప్రతి నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. ఇంటెలిజెన్స్, సెక్యూరిటీ తప్పిదాలు ఉన్న మాట వాస్తవం" అన్నారు. గుర్‌దీప్ సింగ్ సప్పల్ మాట్లాడుతూ.. కొన్నేళ్లుగా ప్రజాస్వామ్యం, రాజ్యాంగం మీద దాడులు జరుగుతున్నాయి. పహల్గాంలో ఉగ్రదాడి నేపథ్యంలో భారత్ సమ్మిట్‌లో కళా, సాంస్కృతిక, వినోద తదితర అనేక కార్యక్రమాలను తగ్గించుకున్నాం. సమావేశాల్లో పలు తీర్మానాలు కూడా చేస్తాం' అని తెలిపారు. సమ్మిట్‌లో తెలంగాణను ప్రపంచానికి రోల్ మోడల్‌గా చూపుతామని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

### పలు అంశాలపై చర్చాగోష్ఠులు

'భారత్ సమ్మిట్'లో జరిగే చర్చాగోష్ఠుల్లో వివిధ దేశాల ప్రతినిధులతో పాటు కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీ, సల్మాన్‌ఖుర్షీద్, కేసీ వేణుగోపాల్ తదితరులు ప్రసంగించనున్నారు. సమ్మిట్ ఏర్పాట్లను కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, గుర్‌దీప్ సింగ్, శ్రీధర్‌బాబు, మహేశ్‌కుమార్‌గౌడ్, విశ్వనాథ్, రాజగోపాల్‌రెడ్డి, మధుయాస్కీగౌడ్ తదితరులు గురువారం సాయంత్రం పరిశీలించారు. సమ్మిట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రధానహాలులో వేదికపై గాంధీ విగ్రహం పెట్టారు. హాలులో ఇరువైపులా మహాత్మాగాంధీ, భగత్‌సింగ్, సుభాష్ చంద్రబోస్, మౌలానా ఆజాద్, డా.బాబూ రాజేంద్రప్రసాద్ తదితర 40కి పైగా నేతల చిత్ర పటాలు ఏర్పాటు చేశారు. సమ్మిట్‌లో పాల్గొనడానికి వివిధ దేశాల ప్రతినిధులు గురువారం హైదరాబాద్ చేరుకోగా.. విమానాశ్రయంలో వారికి ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి స్వాగతం పలికారు.

## పర్యాటకులపై ఉగ్రదాడి గర్హనీయం: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: జమ్మూకశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి గర్హనీయమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ చర్యను తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాదుల కాల్పుల్లో మరణించిన పర్యాటకులకు ఆత్మశాంతి కలగాలని ప్రార్థిస్తూ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో గురువారం ముఖ్యమంత్రి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఏఐసీసీ ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు, ఎంపీలు, ఇతర నేతలు పాల్గొన్నారు. ఉగ్రదాడులు, తదనంతర పరిణామాలు, ప్రస్తుతం అక్కడి పర్యాటకుల పరిస్థితిపై ముఖ్యమంత్రి చర్చించారు. పహల్గాంలో ఉగ్రదాడికి నిరసనగా శుక్రవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించాలని ఏఐసీసీ పిలుపునివ్వడంతో.. గురువారం సాయంత్రం హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన ర్యాలీ వాయిదా పడింది. శుక్రవారం సాయంత్రం 5 గంటలకు నెక్లస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించనున్నారు.

## పాడి కౌశిక్ రెడ్డికి హైకోర్టులో ఊరట



హైదరాబాద్: పాడి కౌశిక్ రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది.. సుబేదారి పీఎస్‌లో నమోదైన కేసులో అరెస్ట్ చేయొద్దంటూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.. సోమవారం వరకు కౌశిక్ రెడ్డిని అరెస్ట్ చేయొద్దంటూ హైకోర్టు ఆదేశించింది. దర్యాప్తు కొనసాగించొచ్చని, పోలీసులకు సహకరించాలని కౌశిక్ రెడ్డికి సూచించింది.. క్వారీ యజమాని మనోజ్‌ను 50లక్షల ఇవ్వాలంటూ బెదిరించాడని కౌశిక్‌పై కేసు నమోదైన విషయం తెలిసిందే. మనోజ్ భార్య ఉమాదేవి ఫిర్యాదు మేరకు సుబేదారి పీఎస్‌లో కేసు నమోదైంది. కేసును కొట్టేయాలంటూ పాడి కౌశిక్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. రాజకీయ కక్షయల కారణంగానే కేసు నమోదు చేశారని కౌశిక్ రెడ్డి న్యాయవాది కోర్టులో వాదించారు.. 27న ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలు ఉన్నాయని న్యాయవాది కోర్టుకు తెలిపారు.. కమలాపూరం మండలం వంగపల్లిలో క్వారీ నిర్వహిస్తున్న మనోజ్.. 2023 అక్టోబర్25న 25లక్షల రూపాయలు కౌశిక్ రెడ్డికి మనోజ్ చెల్లించినట్లు-వాంగ్మూలం ఉంది కదా అని పీపీని హైకోర్టు ప్రశ్నించింది.. బెదిరించడంతో రూ. 25లక్షలను కౌశిక్ రెడ్డికి మనోజ్ చెల్లించాడని పీపీ స్పష్టం చేశారు. ఇప్పుడు రూ. 50లక్షలు ఇవ్వాలని బెదిరించడంతో పీఎస్‌లో ఫిర్యాదు చేసినట్లు- పేర్కొన్నారు. 2023లో ఎందుకు ఫిర్యాదు చేయలేదని పీపీని హైకోర్టు ప్రశ్నించింది. కౌశిక్ రెడ్డిని తదుపరి విచారణ వరకు అరెస్ట్ చేయొద్దని ఆదేశిస్తూ 28వ తేదీకి విచారణ వాయిదా వేసింది.

## టీనేజ్ యువతులకు గుడ్‌న్యూస్..
# ప్రభుత్వం కొత్త పథకం..

తెలంగాణ: మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లతో ప్రస్తుత కాలంలో చాలా మంది టీనేజ్ యువతులు రక్తహీనత, ఐరన్ లోపంతో బాధపడుతున్నారు. శరీరంలో రక్తంలో హీమోగ్లోబిన్ స్థాయిలు తగ్గిపోవడం వల్ల తలెత్తే సమస్యే రక్తహీనత. రక్తహీనతతో శరీరానికి తగినంత ఆక్సిజన్ సరఫరా కాకపోవటంతో పలు అనారోగ్య సమస్యలు వస్తాయి. టీనేజ్ శరీరంలో వేగవంతమైన మార్పులు జరిగే వయస్సు కాగా.. ఈ సమయంలో శరీరానికి మోతాదులో రక్తం, ఐరన్ అవసరం ఉంటుంది. అయితే చాలా మంది టీనేజ్ యువతులు సరైన పోషకాహారం తీసుకోరు. జంక్ ఫుడ్, ప్రాసెస్ చేసిన ఆహారాలు ఎక్కువగా తీసుకోవడం, పండ్లు, కూరగాయలు, ఐరన్ అధికంగా ఉండే ఆహారాలు తక్కువగా తీసుకోవడం వల్ల ఐరన్ లోపం ఏర్పడుతుంది. వీటితో పాటు ఫోలేట్, విటమిన్ విటమిన్ వంటి సూక్ష్మ పోషకాల లోపం కూడా రక్తహీనతకు దారితీస్తుంది.

ఒక అధ్యయనం ప్రకారం.. తెలంగాణలోని రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదువుతున్న టీనేజ్ అమ్మాయిలలో రక్తహీనత ప్రబలంగా ఉంది. 81.6 శాతం అమ్మాయిలు రక్తహీనతతో బాధపడుతున్నట్లు గుర్తించారు. వీరిలో 32.7 శాతం మంది తీవ్రమైన, 31.8 శాతం మంది మధ్యస్థంగా, 17.1 శాతం మంది తేలికపాటి రక్తహీనతతో బాధపడుతున్నారు. టీనేజ్ అమ్మాయిలు రక్తహీనతతో బాధపడితే.. అది ఆమె భవిష్యత్తు గర్భధారణపై, శిశువు ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. పుట్టే బిడ్డ బరువు తక్కువగా ఉండడం, గర్భస్రావం వంటి ప్రమాదాలు తలెత్తే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. యువతులకు గుడ్‌న్యూస్ చెబుతూ.. వారి కోసం కొత్త పథకాన్ని తీసుకొచ్చేందుకు రెడీ అయింది. తెలంగాణలో ఐరన్ లోపం, రక్తహీనత సమస్యలను తగ్గించేందుకు ప్రభుత్వం మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 14 నుంచి 18 ఏళ్ల మధ్య వయస్సున్న యువతుల ఆరోగ్యాన్ని మెరుగుపర్చేందుకు మిల్లెట్ పట్టీలు, పల్లి పట్టీలు పంపిణీ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రతి యువతికి నెలకు 15 ప్యాకెట్ల చొప్పున ఈ ఆహార పదార్థాలను అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించనున్నారు. ఈ పథకానికి 'ఇందిరమ్మ అమృతం' అనే పేరును పరిశీలిస్తున్నారు, దీనిపై నిర్ణయం త్వరలో సీఎం రేవంత్ తీసుకోనున్నట్లు అధికారవర్గాలు వెల్లడించాయి.

## వాతావరణ శాఖ హెచ్చరిక..
# మూడు జిల్లాలకు రెడ్ అలర్ట్

తెలంగాణ: రానున్న మూడు రోజుల్లో తెలంగాణలో తీవ్రమైన వడగాల్పులు, ఉక్కపోత ఉంటాయని హైదరాబాద్ వాతావరణ శాఖ హెచ్చరించింది. ఉత్తర తెలంగాణ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. సంగారెడ్డి, వికారాబాద్, హైదరాబాద్, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి మినహా మిగిలిన జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. ప్రజలు పగటిపూట అత్యవసర పనులుంటే తప్ప ఎట్టి పరిస్థితుల్లో బయటకు రావద్దని అధికారులు సూచిస్తున్నారు.

తెలంగాణ ప్రజలకు హైదరాబాద్ వాతావరణ శాఖ హెచ్చరిక జారీ చేసింది. గత కొన్ని రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో కాస్త ఉపశమనం పొందిన ప్రజలు, రానున్న మూడు రోజులు తీవ్రమైన వేడిమిని ఎదుర్కోవలసి ఉంటుంది. హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారులు రానున్న 72 గంటల్లో రాష్ట్రంలో వడగాల్పులు, అధిక ఉక్కపోత ఉంటుందని స్పష్టం చేశారు. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాలపై వడగాల్పుల ప్రభావం ఎక్కువగా ఉండనుందని వారు తెలిపారు. అధిక ఉష్ణోగ్రతలు 44 డిగ్రీల సెల్సియస్‌ను దాటే అవకాశం ఉన్నందున, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేస్తున్నారు. వృద్ధులు, పిల్లలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులు తెలిపారు.

ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో రానున్న మూడు రోజులు తీవ్రమైన ఉక్కపోత, ఎండలు, వడగాల్పులు తీవ్రంగా ఉండనున్నాయి. ఈ నేపథ్యంలో.. ఆయా జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ప్రజలు పగటిపూట అత్యవసర పనులుంటే తప్ప బయటకు రావద్దని అధికారులు సూచిస్తున్నారు.

**వడదెబ్బతో ఒక్కరోజే ఏడుగురు బలి, 48 గంటలు మరింత డేంజర్..!**

హైదరాబాద్ వాతావరణ కేంద్రం విడుదల చేసిన తాజా హెచ్చరికలు మరింత కలవరపాటుకు గురిచేస్తున్నాయి. రానున్న రెండు రోజుల్లో.. తెలంగాణలో ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీల మేర ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. గురు, శుక్రవారాల్లో ఉత్తర తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ తీవ్రమైన వడగాల్పులు వీచే ప్రమాదం ఉందని హెచ్చరించింది. అంతే కాకుం డా, చాలా జిల్లాల్లో రాత్రిపూట కూడా ఉష్ణోగ్రతలు అధికంగా ఉండి ప్రజలు మరింత ఇబ్బంది పడే అవకాశం ఉందని పేర్కొంది. అయితే, వాతావరణ శాఖ కొంత ఊరటనిచ్చే సూచనలు కూడా చేసింది. ఉత్తర, దక్షిణ ఉపరితల ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో అక్కడక్కడ తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ముఖ్యంగా శుక్ర, శనివారాల్లో కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఈదురుగాలులు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని వెల్లడించింది. అయినప్పటికీ, అప్పటివరకు ఎండల తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని, వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. రాష్ట్రంలో బుధవారం (ఏప్రిల్ 24) రోజున నమోదైన ఉష్ణోగ్రతలు భయానకంగా ఉన్నాయి. నిజామాబాద్ జిల్లాలో అత్యధికంగా 44.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఇది సాధారణం కంటే 3.6 డిగ్రీలు ఎక్కువ కావడం గమనార్హం. ఇతర ప్రాంతాల్లోనూ అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్‌లో 44.3 డిగ్రీలు, మెదక్‌లో 43.4 డిగ్రీలు, రామగుండంలో 42.8 డిగ్రీలు, ఖమ్మం జిల్లాలో 41.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో ప్రజలు తీవ్ర ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు.

**వడదెబ్బతో మృతి చెందిన వారి వివరాలు..**

నిర్మల్ జిల్లా ముథోల్ మండలం ఆష్టా గ్రామానికి చెందిన గంగారాం (55) కరీంనగర్ జిల్లా రామడుగు మండలం గోపాల్‌రావుపేటకు చెందిన కల్లెం రమేశ్ (54) ఖమ్మం జిల్లా మధిర పట్టణం రామనాథం వీధికి చెందిన శేషాచారి (80)

పెద్దపల్లి జిల్లా గోదావరిఖని యైటింక్లయిన్‌కాలనీకి చెందిన పుల్లూరి రమేష్‌కుమార్ (37) వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం తిమ్మంపేటకు చెందిన రవళి (35) హైదరాబాద్ చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లింగంపల్లి రైల్వేస్టేషన్ ఆరో ప్లాట్‌ఫాం ప్రాంతంలో గుర్తు తెలియని ఓ యాచకుడు (70) కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూరు మండలం మార్లవాయి గ్రామానికి చెందిన కనక కాశీరాం (42)

# నిలోఫర్ ఆస్పత్రిలో పాడు పని..






హైదరాబాద్: నిలోఫర్ ఆస్పత్రిలో దాయమ్మ గా పని చేసే మహిళ దగ్గర ఖరీదైన ఇంజెక్షన్లు, మందు లు వెలుగు చూశాయి. సదరు మహిళ ఆస్పత్రిలోకి వచ్చే సమయం లో రెండు సంచులు తీసుకుని వచ్చింది. ఆమె తీరు కాస్త అనుమానాస్పదంగా ఉండటంతో పోలీసులకు విచారించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఆమె వద్ద ఖరీదైన మందులు, ఇంజెక్షన్లు వెలుగులోకి వచ్చాయి. మరి వాటిని దొంగతనం చేసిం దా.. లేక బయట నుంచి తెచ్చిందా అనేది తెలియలేదు.

కార్పొరేటు, ప్రైవేటు ఆస్పత్రిలో చేరే స్థోమత లేకనే.. ప్రభుత్వ ఆస్పత్రికి వస్తారు. గవర్నమెంట్ హస్పిటల్‌కి వచ్చే వారిలో ఎక్కువ మంది.. మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి, పేద కుటుంబాలకు చెందిన వారే ఉంటారు. కారణం ఉచిత వైద్యం, మందులు కూడా ఫ్రీగానే ఇస్తారనే ఉద్దేశంతో. కానీ ప్రభుత్వ ఆస్పత్రుల్లో పని చేసే కొందరికి ఇవేం పట్టవు. వారి పరిస్థితి గురించి ఏమాత్రం ఆలోచించకుండా డబ్బులు డిమాండ్ చేస్తారు. ఎక్కువ శాతం.. క్లీనింగ్, అటెండెంట్ డ్యూటీ చేసే వారు ఇలా వసూళ్లకు పాల్పడుతుంటారు. ఇచ్చినంత తీసుకోరు.. డిమాండ్ చేస్తారు. డబ్బుల్లేవంటే నానా రచ్చ చేస్తారు. ఇక మరి కొందరు ఓ అడుగు ముందుకు వేసి ఆస్పత్రిలో చేతి వాటం చూపుతూ.. మందులు, ఇంజక్షన్లు, గ్లూకోజు బాటిల్స్‌ను దొంగిలించి.. వాటిని బయట అమ్ముకుంటారు. ఈ కోవకు చెందిన ఘటన ఒకటి వెలుగులోకి వచ్చింది.

నిలోఫర్ ఆస్పత్రికి చెందిన మహిళా సిబ్బంది దగ్గర ఇంజెక్షన్లు, సిరంజీలు, ఖరీదైన మందులు వెలుగు చూడటం సంచలనంగా మారింది. ఈ సంఘటన బుధవారం నాడు వెలుగులోకి వచ్చింది. నిలోఫర్ ఆస్పత్రిలో కొన్నాళ్ల పాటు దాయమ్మగా పని చేసిన శాలిని.. ప్రస్తుతం లిఫ్ట్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తుంది. ఈ క్రమంలో మంగళవారం రాత్రి విధులకు వచ్చే సమయంలో రెండు పెద్ద సంచులు తీసుకుని వచ్చింది. ఆమె ప్రవర్తన కాస్త అనుమానాస్పదంగా ఉండటంతో... అక్కడ విధులు నిర్వహించే పోలీసులు ఆమె దగ్గరకు వెళ్లి ఆరా తీశారు. లిఫ్ట్ ఆపరేటర్‌కు సంచులతో ఏం పని అని ప్రశ్నించారు.

తన బండారం బయటపడుతుందని భావించిన శాలిని.. రివర్స్‌లో పోలీసుల మీదనే తిరగబడింది. వారిపైన అరిచి గోల చేసింది. కానీ పోలీసులు వెనక్కి తగ్గలేదు. మహిళా సిబ్బందిని పిలిపించి శాలిని వద్ద ఉన్న సంచలను చెక్ చేయమని చెప్పారు. సంచులను తెరిచి చూసిన వారు ఒక్కసారిగా షాక్ అయ్యారు. ఎందుకంటే సంచుల్లో ఏకంగా మందుల దుకాణమే కనిపించింది. రూ.6 వేలు, రూ.7 వేలు ఖరీదు చేసే ఇంజెక్షన్లు, సిరంజీలు, ఖరీదైన మందులు బయటపడ్డాయి. మరో సంచిలో డబ్బులు బయటపడ్డాయి.

దాంతో పోలీసులు మందులు ఎక్కడవని ప్రశ్నించారు. కోఠి నుంచి వచ్చే సమయంలో కొనుక్కుని వచ్చానని చెప్పింది శాలిని. కానీ అవన్ని అక్కడ ఆస్పత్రిలోనివే అని పోలీసులు, వైద్యాధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు రోగులు షాకింగ్ విషయాలు వెల్లడించారు. రాత్రి సమయాల్లో ఆస్పత్రికి వచ్చే రోగులకు మందులు లేవని బయటకు పంపుతారని చెప్పారు. ఇక ఎమర్జెన్సీ వేళల్లో బయటకు వెళ్లి వచ్చే సరికి లేట్ అవుతుంది. అలాంటి వారిని టార్గెట్ చేసుకుని రెట్టింపు డబ్బులు తీసుకుని మందులు అమ్ముతున్నట్లు తెలిపారు. ఈ ఘటనపై బుధవారం డ్యూటీ ఆర్ఎంఓ నాంపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శాలిని దగ్గర దొరికిన మందులు స్వాధీనం చేసుకున్నారు.

## వివాదంలో చిక్కుకున్న హైదరాబాద్
# మెట్రో రైలు యాజమాన్యం..



హైదరాబాద్: హైదరాబాద్ మెట్రో రైళ్లలో బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్లపై హైకోర్టు సీరియస్ అయింది. ఈ వ్యవహారంలో హెచ్ఎంఆర్ఎల్ ఎండీకి నోటీసులు జారీ చేసింది. బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్లకు సంబంధించిన వివరాలతో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. దీనిపై అడ్వకేట్ నాగూర్ బాబు పిల్ దాఖలు చేయగా, కోర్టు విచారణ జరిపి తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేసింది.

హైదరాబాద్ నగర ప్రజారవాణా వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తోన్న మెట్రో రైల్.. ఇప్పుడు వివాదంలో చిక్కుకుంది. హైదరాబాద్ మెట్రో రై ళ్లలో యథేచ్ఛగా జరుగుతున్న బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్లపై తెలంగాణ హైకోర్టు తీవ్రంగా స్పందించింది. ఈ వ్యవహారంలో హైదరాబాద్ మెట్రో రైలు లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్వీఎస్ రెడ్డికి అత్యవసర నోటీసులు జారీ చేసింది. బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్లకు సంబంధించిన సమగ్ర వివరాలతో కౌంటర్ అఫిడవిట్‌ను తక్షణమే దాఖలు చేయాలని ఆదేశించింది. దీంతో ఈ అంశం రాష్ట్రంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మెట్రో రైళ్లలో చట్టవిరుద్ధంగా బెట్టింగ్ యాప్‌లను ప్రోత్సహిస్తున్నారని ఆరోపిస్తూ.. హైకోర్టులో అడ్వకేట్ నాగూర్ బాబు ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. రోజుకు సుమారు 5 లక్షల మంది ప్రయాణించే మెట్రో రైలులో నిబంధనలను తుంగలో తొక్కి అధికారులు ఎలా బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్‌కు అనుమతిస్తున్నారని నాగూర్ బాబు తీవ్రంగా ప్రశ్నించారు. ఇది యువతను తప్పుదోవ పట్టించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు.. తెలంగాణ గేమింగ్ యాక్ట్ 2017 స్పష్టంగా అమల్లో ఉన్నప్పటికీ, లేదా దాని అనుబంధ సంస్థలు ఈ చట్టాన్ని ఉల్లంఘించి ఇల్లీగల్ బెట్టింగ్ యాప్‌లను ప్రోత్సహించడానికి భారీగా ముడుపులు తీసుకున్నారని పిటిషన్‌లో ఆరోపించారు. ఈ అక్రమ లావాదేవీలపై ఎన్‌ఫో ర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) చేత సమగ్ర విచారణ జరిపించాలని ఆయన కోరారు. ఈ కుంభకోణం లో ఎంత మంది అధికారులు, ప్రైవేట్ వ్యక్తులు లబ్ధి పొందారో తేల్చాలని డిమాండ్ చేశారు.

ఈ పిటిషన్‌పై గురువారం (ఏప్రిల్ 24) రోజు.. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి కీలక విచారణ చేపట్టారు. పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు విన్న అనంతరం, ప్రతివాదులైన ఎండీకి నోటీసులు జారీ చేశారు.

పూర్తి ఆధారాలు, వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని కచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు. తదుపరి విచారణను వచ్చే సోమవారానికి (ఏప్రిల్ 28, 2025) వాయిదా వేశారు. దీంతో ఈ కేసులో రానున్న రోజుల్లో మరిన్ని సంచలన విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని న్యాయ నిపుణులు భావిస్తున్నారు. హైకోర్టు ఈ వ్యవహారాన్ని ఎంత సీరియస్‌గా తీసుకుంటుందో చూడాల్సి ఉంది. ఒకవేళ ఇది నిర్లక్ష్యం తేలితే కఠిన చర్యలు తప్పకపోవచ్చని తెలుస్తోంది.

# శ్రీనివాస్ అఘోరిగా ఎలా మారాడు..?



తెలంగాణ: గత కొద్ది రోజులుగా రెండు తెలుగు రాష్ట్రాల్లో లేడీ అఘోరీ నాగసాధువు హల్‌చల్ చేస్తున్నాడు. సనాతన ధర్మ పరిరక్షణ పేరుతో ఏపీ, తెలంగాణల్లోని ప్రముఖ ఆలయాలను నగ్నంగా దర్శించుకునే ప్రయత్నం చేశాడు. ఆ సమయంలో కొందరు అతడిని దేవుడి స్వరూపంగా భావించగా.. మరికొందరు మాత్రం అతడి చేష్టల పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ తర్వాత ఏపీకి చెందిన వర్షిణి అనే అమ్మాయిని ట్రాప్ చేసి పెళ్లి చేసుకోవటంతో అఘోరి వ్యవహారం మరింత హాట్ టాఫిక్‌గా మారింది. అయితే ఇటీవల అఘోరికి సంబంధించిన ఓ ఫోటో సోషల్ మీడియాలో వైరల్ అయింది. స్టైలిష్ హెయిర్ కట్‌తో దిగిన ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.

అఘోరి అసలు పేరు శ్రీనివాస్ కాగా.. మంచిర్యాల జిల్లాలోని నెన్నెల గ్రామంలోని ఓ నిరుపేద కుటుంబంలో అతడు జన్మించాడు. ఓ పల్లెటూరు నుంచి వచ్చిన శ్రీనివాస్ అఘోరిగా ఎలా మారాడనేది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది. శ్రీనివాస్ నిజంగా హిమాలయాలకు వెళ్లాడా..? అక్కడే ట్రాన్స్ జెండర్‌గా మారేందుకు అవసరమైన సర్జరీలు చేసుకున్నాడా..? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రముఖ యూట్యూబర్ నా అన్వేషణ అన్వేష్ శ్రీనివాస్ అఘోరిగా ఎలా మారాడనే విషయంపై ఓ వీడియో చేశాడు. అందులో శ్రీనివాస్ అఘోరిగా ఎలా మారాడన్న దానిపై పూస గుచ్చినట్లు వివరించారు. ఆ వివరాలు అతడి మాటల్లోనే..

'శ్రీనివాస్ కటిక పేదరికంలో పుట్టాడు. అతని తల్లిదండ్రులది రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితి. శ్రీనివాస్ ఓ రోజు సైకిల్ తొక్కుతూ వెళ్తున్నప్పుడూ ప్రమాదవశాత్తు వరిబీజం (హైడ్రోసిల్) బారిన పడ్డాడు. ఆపరేషన్ తర్వాత వరిబీజం తీసేశారు. ఆ తర్వాత గ్రామంలోని పకోడీలు, శనగపిండి ఐటమ్స్ తినటం వల్ల మరో వరిబీజం కూడా డ్యామేజ్ అయింది. ఆ తర్వాత ఇన్‌ఫెక్షన్ బారిన పడటంతో మర్మాంగాలు పూర్తిగా తొలగించాలని డాక్టర్లు చెప్పారు. లేదంటే ప్రాణాలకే ప్రమాదమని హెచ్చరించారు. ఆ సర్జరీకి దాదాపు రూ.3 లక్షల ఖర్చు అవుతుంది. డబ్బుల్లేక ఏం చేయాలో తెలియక శ్రీనివాస్ హిజ్రా వేశంతో ముంబై పారిపోయాడు. ముంబైలో హిజ్రా అని చెప్పి అక్కడ నిజమైన హిజ్రాలను మోసం చేసి ఉచితంగా ఆపరేషన్ చేయించుకున్నాడు.

ఆ తర్వాత ముంబై రోడ్లపై కొన్ని రోజులు భిక్షాటన చేశాడు. అదే సమయంలో కొన్ని మీడియా ఛానెళ్లలో నాగసాధు గురించి ప్రత్యేక కథనాలు వచ్చాయి. ఆ కాన్సెప్ట్ మనోడికి బాగా నచ్చింది. నాగసాధు, అఘోరికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని భావించాడు. అంతే.. ఆ తర్వాత రూ.5 పౌడర్ రాసేసుకొని.. లిప్‌స్టిక్ రాసుకొని అఘోరి వేశం కట్టాడు. ఆ తర్వాత తెలుగు రాష్ట్రాల్లో ల్యాండ్ అయి ఇప్పుడు హల్‌చల్ చేస్తున్నాడు.' అని నా అన్వేషణ అన్వేష్ శ్రీనివాస్ గురించి చెప్పాడు. ప్రస్తుతం ఈ వీడియో వైరల్ అవుతోంది. పూజల పేరుతో ఓ మహిళను మోసం చేసిన కేసులో అఘోరిని హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. న్యాయమూర్తి అతడికి 14 రోజుల రిమాండ్ విధించగా.. ప్రస్తుతం చంచల్‌గూడ జైలుకు తరలించారు.

**అరెస్టుపై స్పందించిన లేడీ అఘోరీ**

పూజల పేరుతో మోసం చేసి బెదిరింపులకు పాల్పడిందనే ఓ మహిళ ఫిర్యాదుతో లేడీ అఘోరీని పోలీసులు అరెస్టు చేశారు. చీటింగ్, బెదిరింపుల కేసులు నమోదు చేసిన మోకిలా పోలీసులు. నేడు కోర్టులో హాజరు పరచనున్నారు. కాగా, తనను జైలుకు పంపినా వర్షిణితోనే ఉంటానని అఘోరి తెగేసి చెబుతోంది. ఇదిలా ఉండగా.. వర్షిణి బలవంతపు పెళ్లి వ్యవహారం కూడా గతంలో చర్చనీయాంశ మైంది. తాజా అరెస్టుతో ఈ కేసు కొత్త మలుపు తిరిగింది.

తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారిన లేడీ అఘోరీ నాగసాధును పోలీసులు మంగళవారం ఉత్తర్‌ప్రదేశ్‌లో అరెస్టు చేశారు. ఆమెతో పాటు ఇటీవల అఘోరిని పెళ్లి చేసుకున్న వర్షిణిని కూడా అదుపులోకి తీసుకుని హైదరాబాద్‌కు తరలించారు. పూజల పేరిట రూ.10 లక్షలు తీసుకుని మోసం చేసిందని.. అడిగితే బెదిరింపులకు పాల్పడిందని ఓ మహిళ చేసిన ఫిర్యాదు మేరకు మోకిలా పోలీసులు అఘోరీపై చీటింగ్, బెదిరింపుల కేసులు నమోదు చేశారు.

అఘోరిని అరెస్టు చేసిన పోలీసులు నేడు దాదాపు రెండు గంటల పాటు విచారించారు. ఆ తర్వాత వైద్య పరీక్షల నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి, అనంతరం కోర్టులో హాజరు పరచారు. అరెస్టుపై స్టేషన్ ఎదుట మీడియాతో మాట్లాడిన అఘోరి.. చట్టం తన పని తాను చేస్తుందని చెప్పారు. తాను పోలీసులకు, కోర్టుకు సహకరిస్తానని వెల్లడించారు. ప్రస్తుతం తాను జైలుకు వెళ్ళినా.. తన భార్య వర్షిణి తనతోనే ఉంటుందని తెలిపింది.

బాధిత మహిళ ఫిర్యాదు వివరాల ప్రకారం.. ఆరు నెలల క్రితం లేడీ అఘోరితో పరిచయం ఏర్పడింది. ఆ తర్వాత తరచుగా ఫోన్‌లో సంప్రదిస్తూ వ్యక్తిగత వివరాలు తెలుసుకుని, పూజలు చేస్తే జీవితంలో మేలు జరుగుతుందని నమ్మించింది. పూజ ఖర్చుల పేరిట మొదట రూ.5 లక్షలు, తరువాత మరో రూ.5 లక్షలు లేడీ అఘోరి అకౌంట్లో జమ చేయించిందని బాధితురాలు వెల్లడించింది. ఆ తర్వాత పూజలు చేయకపోగా.. తీసుకున్న డబ్బు తిరిగి ఇవ్వలేదు. చివరకు మోసపోయినట్లు గ్రహించిన అఘోరి పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు అఘోరిని అరెస్టు చేశారు. గత కొన్ని నెలలుగా లేడీ అఘోరి, వర్షిణిల వ్యవహారం మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. మా కుమార్తెను మాయ మాటలతో లోబరుచుకుని, కేదార్నాథ్‌లో బలవంతంగా పెళ్లి చేసుకున్నాడని వర్షిణి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. వీరి పెళ్లికి సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్ అయిన సంగతి తెలిసిందే. అంతేకాక, అరెస్టు చేసే ప్రయత్నం చేస్తే ఆత్మహత్య చేసుకుంటామని ఈ జంట ఓ సెల్ఫీ వీడియో ద్వారా హెచ్చరించటమూ ఇటీవల కలకలం రేపింది. తాజాగా అఘోరి అరెస్టుతో ఈ వ్యవహారం మరో మలుపు తిరిగింది.

# స్మితా సబర్వాల్ తప్పేమీ లేదు..

ఖైరతాబాద్: ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మరోసారి తన వ్యాఖ్యలతో మరోసారి రాజకీయ వర్గాల్లో దుమారం రేపారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిపోయిన దానం నాగేందర్.. మొన్నటివరకు గులాబీ పార్టీ నేతలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడిన విషయం తెలిసిందే. కాగా.. ఇప్పుడు రూట్ మార్చేసి.. కేసీఆర్ మీద కాస్త పాజిటివ్‌గా మాట్లాడటం మొదలుపెట్టారు. ఆ మధ్య ఓ యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కేసీఆర్‌ను పొగిడి.. హస్తం నేతలను ఆశ్చర్యపరిచిన దానం.. ఇప్పుడు మళ్లీ అలాంటి వ్యాఖ్యలే చేసి అవాక్కయ్యేలా చేశారు.

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ త్వరలో నిర్వహించబోయే సభ విజయవంతం అవుతుందని దానం నాగేందర్



ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్‌ను చూడటానికి ప్రజలు ఆసక్తిగా ఉన్నారని వ్యాఖ్యానించారు. "కేసీఆర్ సభకు భారీగా జనం వస్తారు. ప్రజలు ఆయనను చూడటానికి ఆసక్తిగా ఉన్నారు." అని దానం నాగేందర్ స్పష్టం చేశారు. కేసీఆర్ సభకు ప్రజల నుంచి భారీ స్పందన వస్తుందని దానం నాగేందర్ అంచనా వేశారు.

మరోవైపు.. కంచ గచ్చిబౌలి భూముల వివాదంపై సీనియర్ ఐఏఎస్ అధికారి, తెలంగాణ పర్యాటక, సాంస్కృతిక శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్న స్మితా సబర్వాల్ చేసిన రీట్వీట్ వివాదంపై కూడా దానం నాగేందర్ స్పందించారు. స్మితా సబర్వాల్ రీట్వీట్ చేయటంలో తప్పేమీ లేదన్నారు.. ఆమె వాస్తవాన్నే ట్వీట్ చేశారని దానం నాగేందర్ అభిప్రాయపడ్డారు. "స్మితా సబర్వాల్ ట్వీట్‌లో తప్పేం లేదు. ఆమె వాస్తవాన్నే ట్వీట్ చేశారు. ఆమె ప్రభుత్వాన్ని ఉద్దేశించి ట్వీట్ చేసినట్లు లేదు. ఇదే విషయంలో సీఎస్ శాంతి కుమారిపై సుప్రీంకోర్టు సీరియస్ అయింది. భూముల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా పునరా లోచన చేస్తుందని అనుకుంటున్నా." అని దానం ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు.

ఈ రెండు విషయాల్లో దానం నాగేందర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో పలు చర్చలకు దారితీస్తున్నాయి. కేసీఆర్ సభపై దానం చేసిన వ్యాఖ్యలు బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపగా.. స్మితా సబర్వాల్ ట్వీట్‌పై చేసిన కామెంట్లు.. అధికార పార్టీలో చర్చనీయాంశమయ్యాయి. దానం నాగేందర్ వ్యాఖ్యలు రానున్న రోజుల్లో రాజకీయంగా ఎలాంటి పరిణామాలకు దారి తీస్తాయో వేచి చూడాలి.

# అంగట్లో సరుకుల్లా బర్త్ సర్టిఫికేట్లు..

హైదరాబాద్: హైదరాబాద్‌లో నకిలీ పత్రాల ముఠా అరెస్ట్ వ్యవహారం దేశ భద్రతపై తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. నార్సింగి మున్సిపాలిటీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగితో పాటు మరో ముగ్గురు ఏజెంట్లు, ఇద్దరు బంగ్లాదేశీయులు కలసి నకిలీ జనన ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డులు సృష్టించి, పాస్‌పోర్ట్‌లకు దరఖాస్తు చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ చర్యలు ఉగ్రవాదులకు దేశంలో చొరబడేందుకు మార్గం కల్పించవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వ యంత్రాంగంలోని కొందరు వ్యక్తులు స్వార్థపూరితంగా వ్యవహరిం చడం వల్ల దేశ భద్రత ప్రమాదంలో పడుతోంది. వ్యవస్థలోని అవినీతిని, బాధ్యతారాహిత్యాన్ని కూడా తెలియజేస్తున్నాయి. దేశంలో అక్రమంగా ప్రవేశించిన ఇద్దరు బంగ్లాదేశీయులకు నకిలీ బర్త్ సర్టిఫికేట్లు, ఆధార్ కార్డులు జారీ చేసి వారు పాస్‌పోర్ట్ పొందేలా చేసిన ఘటనలో హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆరుగురు నిందితులను అరెస్టు చేశారు. నార్సింగి మున్సిపాలిటీ ఔట్‌సో ర్సింగ్ ఉద్యోగి జి.సుధీర్ కుమార్ , మహ్మద్ ముఖీబ్, టి.సాయి కిరణ్, జి.రంజనీకాంత్ , బంగ్లాదేశ్‌కు చెందిన మహ్మద్ హసిబుల్, రోహన్ షాలను అదుపులోకి తీసుకున్నారు. ప్రధాన నిందితుడు హసిబుల్ ఢాకా నుంచి నాలుగేళ్ల క్రితం రూ.25 వేలు చెల్లించి అక్రమంగా భారత్‌లోకి ప్రవేశించాడు. కోల్‌కతాలో జోవన్ చౌదరి అనే నకిలీ పేరుతో ఆధార్ కార్డు పొందాడు. అక్కడ కరాటే కోచ్‌గా పనిచేస్తూ.. 2023లో మలక్‌పేట్‌కు చెందిన జయాచౌదరితో ఫేస్‌బుక్ ద్వారా పరిచ యం పెంచుకున్నాడు. తాను కోల్‌కతా పౌరుడినంటూ నమ్మించి ఆమెను వివాహం చేసుకున్నాడు. మలక్‌పేట్‌లో నివాసం ఉంటున్న హసిబుల్.. నార్సింగి మున్సిపాలిటీ ఉద్యోగి సుధీర్‌కు రూ.15,000 లంచం ఇచ్చి నకిలీ జనన ధ్రువీకరణ పత్రం సేకరించాడు. తరువాత ఓటరు కార్డు కూడా పొందాడు. ఇదే మార్గంలో బంగ్లాదే శ్‌కే చెందిన రోహన్ షాకూ నకిలీ బర్త్ సర్టిఫికేట్, ఆధార్ కార్డు ఇప్పించాడు. వీరిద్దరూ పాస్‌పోర్ట్‌కు దరఖాస్తు చేయగా.. అనుమానాస్పదంగా ఉండటం తో టాస్క్‌ఫోర్స్ రంగంలోకి దిగింది. మఫ్టీలో నార్సింగి మున్సిపల్ కార్యాలయానికి వెళ్లిన పోలీసు లు ఫేక్ బర్త్ సర్టిఫికేట్ కావాలని అడగగానే సుధీర్ అంగీకరించడంతో బండారం బయటపడింది.

# ఇది మీ టర్నింగ్ పాయింట్ అవ్వొచ్చు

## 'వేవ్స్'కు పిలుపునిచ్చిన చిరంజీవి



అంతర్జాతీయ స్థాయిలో భారత్‌ను ఎంటర్‌టైన్‌మెంట్ హబ్‌గా మార్చాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం వరల్డ్ ఆడియో విజువల్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్ (వేవ్స్)ను నిర్వహించనుంది. ముంబయిలో మే 1 నుంచి 4 వరకు జరగనుంది. అది ప్రతిభను నిరూపించుకునే వేదిక అని వేవ్స్ అడ్వైజరీ బోర్డులో సభ్యుడు, ప్రముఖ నటుడు చిరంజీవి పేర్కొన్నారు. ఈ మేరకు http://www.wavesindia.orgలో రిజిస్ట్రేషన్ చేసుకుని, ఈవెంట్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

"నేను మొగల్తూరు నుంచి భారీ ఆశలతో వచ్చానని మీలో చాలామందికి తెలుసు. నా నట ప్రయాణం కాలేజ్‌లో ప్రారంభమైంది. ఎలాగైనా సినిమాల్లోకి వెళ్లాలనేది నా కల. దాని కోసం ముందడుగేశా. 'వేవ్స్' మీకు ఫస్ట్ స్టెప్‌లాంటిది. మీ డ్రీమ్స్ నెరవేరేలా చేస్తుంది. మీ కెరీర్ టర్నింగ్ పాయింట్ కావొచ్చు" అని పేర్కొన్నారు. ఆ కార్యక్రమంలో పలు రంగాల ప్రముఖులు పాల్గొననున్నారు. 'స్టార్టప్ బూత్ బుకింగ్ అండ్ ఇన్వెస్టిమెంట్ పిచ్ ఆపర్చునిటీస్' విభాగంలో ఆసక్తిగల వారు తమ ఆయా రంగాల గురించి ఆలోచనలు పంచుకోవచ్చు. తమ ప్రొడక్ట్స్ గురించి చెప్పొచ్చు.

# జూన్ 14న గద్దర్ సినీ పురస్కారాల ప్రదానోత్సవం




ప్రపంచంలో ఎక్కడ గొప్పగా సినీ పురస్కార వేడుకలు జరుగుతాయో... అంతకుమించి హైదరాబాద్ నగరంలో గద్దర్ చలన చిత్ర పురస్కార ప్రదానోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క. ప్రతి చోటా మాట్లాడుకునే స్థాయిలో ఈ వేడుక ఉంటుందని, అందుకు కావల్సిన అన్ని సహాయ సహకారాలు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. మంగళవారం హైదరాబాద్‌లోని ప్రసాద్ ఫిల్మ్ ల్యాబ్స్‌లో తెలుగు చలనచిత్ర అభివృద్ధి సంస్థ (ఎఫ్.డి.సి) ఆధ్వర్యంలో గద్దర్ సినీ పురస్కారాల సన్నాహక కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హాజరై పురస్కార జ్యూరీ కమిటీ ఛైర్మన్ జయసుధకు ఎంట్రీల జాబితాని అందజేశారు.

అనంతరం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ "తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొట్ట మొదట ఇస్తున్న చలన చిత్ర పురస్కారాలు ఇవి. తెలుగు చలన చిత్ర పరిశ్రమ తెలంగాణ రాష్ట్ర రాజధానిలో ఉన్నప్పటికీ, దశాబ్దకాలంగా ఎలాంటి పురస్కారాలకి, ప్రోత్సాహానికీ నోచుకోలేకపోయింది. ఇలాంటి నిర్లక్ష్యం మంచిది కాదని ముఖ్యమంత్రి, ప్రభుత్వం భావించి పురస్కారాల్ని ప్రదానం చేయాలని నిర్ణయించారు. సమాజంలో అంతర్భాగమైన మన కళలు, సంస్కృతిని సినిమాలతో ఖండాంతరాలకి వ్యాపించేలా చేస్తున్న చిత్ర పరిశ్రమని కాంగ్రెస్ ప్రభుత్వాలు అడుగడుగునా ప్రోత్సహిస్తూ వచ్చాయి. దూరంగా ఉన్న తెలుగు సినిమా పరిశ్రమని హైదరాబాద్ నగరానికి తీసుకొచ్చారు నాటి కాంగ్రెస్ ముఖ్యమంత్రులు. వారి హయాంలోనే ఇక్కడ పరిశ్రమ అభివృద్ధి చెందింది. ఈ మాధ్యమాన్ని కాపాడుకోవల్సిన బాధ్యత పాలకులపై ఉంది. తెలుగు సినిమాలకే కాకుండా, ఉర్దూ మాధ్యమంలోని సినిమాల్ని కూడా ప్రోత్సహించాలని నిర్ణయించాం. తెలంగాణ సంస్కృతిని, తెలంగాణ గుండెచప్పుడుని తన కళల ద్వారా విశ్వవ్యాప్తం చేయడంతోపాటు, రాష్ట్ర సాధన కోసం పాదయాత్ర చేసిన గద్దర్ పేరుపై ఈ పురస్కారాల్ని ప్రదానం చేస్తుండడం ఆనందంగా ఉంది" అన్నారు. నిష్పక్షపాతంగా పురస్కారాల ఎంపిక ప్రక్రియ జరగాలని జ్యూరీ కమిటీకి ఆయన సూచించారు.

తెలంగాణ రాష్ట్ర చలనచిత్ర అభివృద్ధి సంస్థ ఛైర్మన్ దిల్‌రాజు మాట్లాడుతూ "ఈ కార్యక్రమంలో ఎంతో ఆర్భాటంగా లోగోని ఆవిష్కరించాలనుకున్నాం. పోప్ ఫ్రాన్సిస్ మృతిపట్ల లోగో ఆవిష్కరణని వాయిదా వేశాం. మే చివరికంతా జ్యూరీ పురస్కారాల ఎంపిక ప్రక్రియని పూర్తి చేస్తుంది. జూన్ 14న ఘనంగా గద్దర్ చలన చిత్ర పురస్కారాల ప్రదానోత్సవాన్ని నిర్వహిస్తాం" అన్నారు. పోప్ ఫ్రాన్సిస్ మృతికి నివాళులతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో పురస్కారాల జ్యూరీ కమిటీ ఛైర్మన్ జయసుధ, ఐ అండ్ పీఆర్ కమిషనర్ హరీశ్, జ్యూరీ సభ్యులు శివ నాగేశ్వరరావు, జీవిత, కాసర్ల శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# నా జాతకం చూసి నేను నటుణ్ని కాలేనన్నారు!



వైవిధ్యభరితమైన కథలతో సినీప్రియుల్ని మెప్పిస్తూ.. హీరోగా తనపై అంచనాల్ని అంతకంతకూ పెంచుకుంటూ వెళ్తున్నారు ప్రియదర్శి. ఇటీవలే 'కోర్ట్..' చిత్రంతో మరో చక్కటి విజయాన్ని ఖాతాలో వేసుకున్న ఆయన ఇప్పుడు 'సారంగపాణి జాతకం'తో అలరించేందుకు సిద్ధమయ్యారు. మోహనకృష్ణ ఇంద్రగంటి తెరకెక్కించిన చిత్రమిది. శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించారు. ఇది ఈ నెల 25న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు ప్రియదర్శి.

**'కోర్ట్' లాంటి విజయం తర్వాత వస్తున్న చిత్రమిది. ఏమైనా ఒత్తిడి ఉందా?**

"ఒత్తిడి ఏమీ లేదు. 'కోర్ట్' లాంటి విజయం తర్వాత 'సారంగపాణి జాతకం' లాంటి మంచి కథతో ప్రేక్షకుల్ని పలకరించనున్నందకు ఆనందంగా ఉంది. దీనిపై నేను చాలా నమ్మకంగా ఉన్నా. నిజానికిది గతేడాది చివర్లో రావాల్సిన సినిమా. రకరకాల కారణాల వల్ల ఆలస్యమై ఈనెల 25న తెరపైకి రానుంది. తనికెళ్ల భరణి, నరేశ్, అవసరాల శ్రీనివాస్ ఇలా అనుభవజ్ఞులైన అద్భుత నటులు చాలా మంది దీంట్లో ఉన్నారు. వాళ్లంతా ప్రేక్షకుల్ని అలరిస్తారు".

**ఈ కథలోకి మీరెలా వచ్చారు? ఈ చిత్రంతో ప్రేక్షకులకు మీరేం చెప్పనున్నారు?**

"నేను దర్శకుడు ఇంద్రగంటితో ఒక ఫొటో దిగితే చాలనుకునేవాణ్ని. అలాంటిది ఆయనే ఓరోజు నన్ను పిలిపించి.. మనం ఒక సినిమా చేద్దామంటే చాలా ఆనందంగా అనిపించింది. ఇదొక జాతకాల పిచ్చోడి కథ.. టైటిల్ 'సారంగపాణి జాతకం' అనుకుంటున్నా అని చెప్పగానే అద్భుతంగా అనిపించింది. ఇక ఆయనతో నా ఫస్ట్ డే షూటింగ్ అయితే ఎప్పటికీ గుర్తుండిపోతుంది. ప్రతి ఒక్కరికీ ఆయనతో కలిసి పని చేసే అవకాశం రావాలని కోరుకుంటున్నా. ఈ చిత్రం ద్వారా జాతకాల్ని నమ్మండని కానీ, నమ్మొద్దని గానీ మేము ఏం చెప్పడం లేదు. ఒకరి నమ్మకాల్ని మరొకరిపై రుద్దితే ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయో చూపించనున్నామంతే. ఇది అందర్నీ నవ్వించే సినిమా. దీన్ని కాస్త ముందుగానే ప్రీమియర్ల రూపంలో ప్రేక్షకులకు చూపించనున్నాం. నచ్చితేనే థియేటర్లకు రండి అని చెప్పనున్నాం".

**మీరు నిజ జీవితంలో జాతకాల్ని నమ్ముతారా? ఎప్పుడైనా జాతకం చెప్పించుకున్నారా?**

"ఈ సినిమాలో చూపించినంత కాదు గానీ నేను జాతకాల్ని కొంత నమ్ముతాను. నాకు ఇండస్ట్రీలోకి వచ్చాక బాగా అర్థమైంది ఏంటంటే ఇక్కడ ఏదీ మన నియంత్రణలో ఉండదు. నేను ఇండస్ట్రీలోకి రాకముందు ఓసారి మా అమ్మ నా జాతకాన్ని ఓ జ్యోతిష్కుడికి చూపించింది. అతనది చూసి నేనసలు యాక్టర్ అవ్వనని చెప్పాడు. అది విని కాస్త బాధపడ్డా.. తర్వాత దాన్నంత పట్టించుకోలేదు. నాకు నచ్చింది నేను చేస్తా.. ఎక్కడో ఉన్న గ్రహం కలవకపోతే నేనేం చేస్తాననుకున్నా. అలా నా ప్రతిభను.. నా జ్ఞానాన్ని నమ్ముకుని ఈ పరిశ్రమలోకి వచ్చా. చేసే పనిని నమ్ముకుని ప్రయాణం సాగిస్తున్నా".

**మీ కొత్త చిత్ర విశేషాలేంటి?**

"ఏషియన్ సినిమాస్ సంస్థలో 'ప్రేమంటే' అనే చిత్రం చేస్తున్నా. జీఏ2 నిర్మాణంలో 'మిత్రమండలి' అనే మరో చిత్రం చేస్తున్నా. అలాగే మరికొన్ని కథలు చర్చల దశలో ఉన్నాయి. ప్రస్తుతం నేను బలమైన పాత్రలుండే సినిమాల్ని ఎక్కువ చేయాలని

# మళ్లీ మంచి సినిమా చేశానని సంతృప్తిగా ఉంది



**నందమూరి కళ్యాణ్ రామ్ తాజా చిత్రం "అర్జున్ S/o వైజయంతి". లేడీ సూపర్ స్టార్ విజయశాంతి పవర్ ఫుల్ పాత్రలో నటించారు. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్లపై అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించారు. ఏప్రిల్ 18న విడుదలైన ఈ మూవీ గురించి విజయశాంతి మాట్లాడుతూ...**

చాలా రోజులవతర్వాత మంచి సినిమా చేశామనే తృప్తి వుంది. ఒక పవర్ ఫుల్ పాత్ర చేయడం జరిగింది. ప్రజలు రాములమ్మని విజయశాంతిని ఎలాంటి పాత్రలో చూడాలని అనుకున్నారో ఈ సినిమాతో అది ఫుల్ ఫిల్ అయ్యింది. ఇప్పుడు యాక్షన్ అనేది ఒకరకంగా నాకు ఛాలెంజ్. కాని నేను చేశాను. యాక్షన్ పెర్ఫార్మెన్స్ ని అందరూ అప్రిషియేట్ చేస్తున్నారు. అందరూ వారి పాత్రలని అద్భుతంగా చేశారు. ఈ సినిమాతో తల్లితండ్రులు కొడుకుల బంధాన్ని వారికి ఇవ్వాల్సిన గౌరవాన్ని బలంగా చూపిండం జరిగింది. ఈ కథని దర్శకుడు పర్ఫెక్ట్ గా హ్యాండిల్ చేశారు. చాలా మహిళలు ఫోన్ చేసి సినిమా అద్భుతంగా వుంది, మదర్ అండ్ సన్ ఎమోషన్ కట్టిపడేసిందని చెబుతుంటే చాలా ఆనందంగా అనిపించింది. పరీక్షల వలన కొందరు చూడలేకపోయారని నాకున్న సమాచారం. రేపటి నుంచి అందరం వెళ్తామని చెబుతున్నారు. రేపటి నుంచి ప్రేక్షకాదరణ ఇంకా అద్భుతంగా వుండబోతోంది" అన్నారు!!

# ఆస్కార్ పురస్కారాల్లో 'ఏఐ'కు చోటు



వచ్చే ఏడాదికి సంబంధించిన ఆస్కార్ పురస్కారాల వివరాలను ప్రకటించింది అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్స్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్. 2026 మార్చి 15న 98వ ఆస్కార్ అవార్డుల వేడుక లాస్ ఏంజెలిస్‌లో జరగనున్నట్లు తెలిపింది. ఈ సందర్భంగా ఓటింగ్ విధానంలో పలు మార్పులు చేసినట్లు తెలిపింది. నామినేట్ అయిన ప్రతి చిత్రాన్ని అకాడమీ సభ్యులు కచ్చితంగా చూడాలని నిర్ణయించింది. తాజాగా 'అచీవ్‌మెంట్ ఇన్ కాస్టింగ్' అనే విభాగాన్ని ప్రవేశపెట్టినట్లు వెల్లడించింది. ఈ విభాగంలో రెండు దశల్లో ఓటింగ్ ప్రక్రియ జరుగుతుందని, ఫైనల్ ఓటింగ్‌కు ముందు కాస్టింగ్ డైరెక్టర్లకు ప్రశ్నోత్తరాల టెస్టింగ్ ఉంటుందని తెలిపింది. సినీ పరిశ్రమలో చోటు చేసుకుంటున్న మార్పుల దృష్ట్యా ఈ ఏడాది కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతతో రూపొందించిన చిత్రాలను కూడా పరిగణనలోకి తీసుకోనున్నట్లు వెల్లడించింది. ఏఐ చిత్రాలు ఇతర చిత్రాలపై ప్రభావం చూపవని, మానవ మేధస్సుకే ఎక్కువ ప్రాధాన్యతనిస్తామని స్పష్టం చేసింది అకాడమీ సంస్థ. 2025 జనవరి నుంచి డిసెంబరు వరకు విడుదలైన చిత్రాలు ఆస్కార్ బరిలో పోటీపడనున్నాయి. మ్యూజిక్ విభాగంలో నామినేషన్ గడువును 2025 అక్టోబరు 15గా నిర్ణయించినట్లు అకాడమీ తెలిపింది.